సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 20 । జూలై । 2024



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి కొవ్వూరి రాజశేఖరరెడ్డి దంపతులు (కొమరిపాలెం) శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు.




భవితకు నవోదయం

8 లో

వచ్చే విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాలకు నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబర్ 16 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు.

డెల్టాలకు 1,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: స్థానికంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శుక్రవారం గోదావరి నీటి విడుదలను తగ్గించారు. తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టా 500 కలిపి మొత్తం 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ప్రొఫెషనల్, డిప్లమా కోర్సు పరీక్షల తేదీలు మార్చాలి

ఏయూకు ఎమ్మెల్సీ ఐవీ విజ్ఞప్తి

అమలాపురం టౌన్: ఆంధ్ర యూనివర్శిటీ (ఏయూ) పీజీ ప్రొఫెషనల్, డిప్లమో కోర్స్ పరీక్షలకు ఇచ్చిన తేదీలు మార్పు చేయాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ శుక్రవారం రాత్రి అమలాపురంలో ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రెండు కోర్సులకు ఇచ్చిన షెడ్యూల్‌లో ఈ నెల 30,31 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉందని వివరించారు. అయితే ఏపీపీఎస్సీ నిర్వహించే ఈవో అండ్ జీవో పరీక్షలు కూడా ఈనెల 30,31 తేదీల్లో జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ రెండు పరీక్షలు రాసే వారిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధికంగా ఉన్నారని తెలిపారు. కాబట్టి ఏయూ నిర్వహించే పరీక్షల నిర్వహణకు ముందే ప్రకటించిన ఈ నెల 30,31 తేదీలను మార్పు చేయాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. అయితే యునివర్శిటీ వీసీ రాజీనామా కారణంగా ఇంత వరకూ ఏ నిర్ణయం తీసుకోలేదని ఎమ్మెల్సీ అభిప్రాయపడ్డారు. కొత్తగా ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు తీసుకున్న శశిభూషణరావుతో ఎమ్మెల్సీ ఐవీ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడి పరీక్షల తేదీల మార్పు ఆవశ్యకతను వివరించారు. తేదీల మార్పుపై తగు నిర్ణయం తీసుకుంటానని తనకు ఇన్‌చార్జి వీసీ తనకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ ఐవీ పేర్కొన్నారు.

రషీద్ హత్య ఆటవిక చర్య

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్

అమలాపురం టౌన్: గుంటూరు జిల్లా వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ అబ్దుల్ రషీద్‌ను టీడీపీ రౌడీలు దారుణంగా హత్య చేయడం ఆటవిక చర్య అని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. రషీద్ హత్యోదంతాన్ని చూసిన వారికి టీడీపీ నాయకులు ఏకపక్షంగా ఎంత పాశవికంగా చంపేశారో అవగతం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు దాడి చేయడాన్ని ఖాదర్ తీవ్రంగా ఖండించారు. అసలు రాష్ట్రంలో పోలీసింగ్ ఉందా అనే సందేహం సామాన్య ప్రజానీకానికి కలుగుతోందని పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్‌ను పూర్తిగా వదిలేసి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకాలు సాగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదన్న వాస్తవాన్ని కూటమి ప్రభుత్వం గమనించాలని ఖాదర్ సూచించారు. ఇలా హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వ పెద్దలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఖాదర్ స్పష్టం చేశారు.

కలిసి పనిచేద్దాం

సాక్షి అమలాపురం: జిల్లా అభివృద్ధికి కలిసి పని చేద్దామని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌తోపాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు నిర్ణయించుకున్నారు. అమలాపురం ఎంపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని ఎమ్మెల్యేలకు ఎంపీ విందు ఇచ్చారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌తోపాటు జాతీయ రహదారుల నిర్మాణాల స్థితిగతులు, పరిశ్రమల ఏర్పాటు, ఎంపీ ల్యాడ్స్ వినియోగం వంటి విషయాలు వారు చర్చించుకున్నారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందం, అయితాబత్తుల అనందరావు, దాట్ల బుచ్చిబాబు, వేగుళ్ల జోగేశ్వర రావు, జనసేన ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ ఈ విందులో పాల్గొన్నారు.

హిమాన్షు శుక్లా రామసేతు వారధి ప్రారంభం



వారధి శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: పాశర్లపూడిలంక-లూటుకుర్రు గ్రామాల మధ్య వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన హిమాన్షు శుక్లా రామసేతు వారధిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన శ్లాబ్ కల్వర్టును తొలగించి రూ.1.01 కోట్లతో ఈ వారధి నిర్మించారు. కలెక్టర్‌గా పనిచేసిన హిమాన్షు శుక్లా ఈ వారధి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో దీనికి హిమాన్షుశుక్లా రామసేతు వారధిగా నామకరణం చేశారు. వారధి నిర్మాణం ద్వారా వేలాది ఎకరాల్లో ముంపు సమస్యకు పరిష్కారం లభించిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో హిమాన్షు శుక్లా తండ్రి మున్నాలాల్ శుక్లా, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీ సభ్యులు నామన వెంకటేశ్వరరావు, చెరుకూరి పార్వతీదేవి పాల్గొన్నారు.

వానసీమ

- జిల్లాలో కుంభవృష్టి
- గురువారం ఉదయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు..
- ఎడతెరిపిలేని వాన
- నగటున 78 మిల్లీమీటర్ల వర్షపాతం
- స్తంభించిన జనజీవనం
- నీట మునిగిన వరి నాట్లు... నారుమడులు
- మరోవైపు పెరిగిన వరద ఉధృతి
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 3.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల
- పలు లంక గ్రామాలకు నిలిచిన రహదారి రాకపోకలు



కె.గంగవరం మండలం తామరపల్లిలో నీట మునిగిన పంట పొలాలు

సాక్షి, అమలాపురం: ఆకాశానికి చిల్లు పడిందన్నట్లు... ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షంతో కోనసీమ తడిసి ముద్దయింది. గురువారం తెల్లవారుజామున మొదలైన సాధారణ వర్షం అంతకంతకూ పెరుగుతూ కుంభవష్టిని తలపించేలా కురిసింది. తెరపన్నది లేకుండా జిల్లాలో ముసురు కమ్మేసింది. మరోవైపు గోదావరి ఉరకలు వేస్తోంది. సుడులు తిరుగుతూ ప్రవహిస్తూ లంకలను చుట్టుముడుతోంది. ఇప్పటికే గోదావరి మధ్యనున్న లంక గ్రామానికి వెళ్లేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాటలు కొట్టుకుపోవడంతో లంకవాసుల రహదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జిల్లాను వర్షాలు ముంచెత్తుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకు నగటున 78 మి.మీటర్ల వర్షం కురిసింది. మండపేటలో అత్యధికంగా 121.4 మి.మీటర్లు వర్షం కురవగా, అత్యల్పంగా 54.2 మి.మీటర్లు పడింది. తరువాత కూడా భారీ వర్షం కురుస్తూనే ఉంది. గురువారం రాత్రి 8 గంటల నుంచి శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎడతెరపి అనేది లేకుండా వర్షం పడింది. కనీసం మధ్యలో వర్షం ఆగిన పరిస్థితి కూడా లేదు. కొండకు చిల్లు పడిందా అన్నట్టుగా కురిసిన వర్షం జిల్లా వాసులను ఇబ్బందులు పాల్జేసింది. మధ్యాహ్నం వరకు పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా జనం ఇళ్లకు పరిమితమయ్యారు. మధ్యాహ్నం నుంచి కాని దుకాణాలు తెరుచుకోని పరిస్థితి. అమలాపురం, రామచంద్రపురం, మండపేటల్లో పలుచోట్ల ప్రధాన రహదారుల మీద వర్షం నీరు చేరింది. పట్టణాలతోపాటు పల్లెల్లో డ్రైనేజీలు పొంగి పొర్లాయి. చిరు వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. లోతట్టు కాలనీలు, రోడ్లపై నీరు చేరింది.

నీళ్లలో చేలు

భారీ వర్షాలకు వందల ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. నారుమడుల పొలాలతోపాటు నాట్లు వేసిన పొలాలు ముంపులో చిక్కుకున్నాయి. ఏకధాటిగా కురిసిన వర్షంతో శివారు మండలాలైన అల్లవరం, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, సఖినేటిపల్లి, రాజోలు, మలికిపురం, కాట్రేనికోనతోపాటు ముమ్మిడివరం, అయినవిల్లి, అమలాపురం, రాజోలులో వరి చేలు పెద్ద ఎత్తున నీట మునిగాయి. ముంపు ప్రభావంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందిస్తున్నారు. కొబ్బరి తోటల్లో నీరు చేరడంతో అంతర పంటలైన అరటి, కోకో వంటి తోటలు నీట మునిగాయి. భారీ వర్షాలు ఇలాగే కొనసాగితే రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం మండలాల్లో మొక్క మీద ఉన్న అరటి, కంద, పసుపు, కూరగాయ పంటలు దెబ్బ తింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

లంకల్లో పెరుగుతున్న వరద

గోదావరి లంకల్లో వరద ఉధృతి పెరుగుతూ వస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు సాయంత్రం ఆరు గంటల సమయంలో 3,45,390 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద ప్రస్తుత నీటి మట్టం 7 అడుగుల ఎత్తున ఉంది. ఇది మరింత పెరిగే అవకాశముంది. ఎగువన భద్రచలం వద్ద 26.5 అడుగులకు వరద చేరగా, ఇది రాత్రికి 30 అడుగుల ఎత్తుకు చేరనుందని అంచనా. ఇదే జరిగితే శనివారం సాయంత్రం సమయానికి కోనసీమ వరద ఉధృతి మరింత పెరగనుందని అంచనా. వరద 5.50 లక్షల క్యూసెక్కులకు పెరగనుంది.

వరద ఉధృతికి జిల్లాలో పి.గన్నవరం, ముమ్మిడివరం మండలాల్లో గోదావరి మధ్యలో ఉన్న లంకలకు వెళ్లే తాత్కాలిక రహదారులు కొట్టుకుపోయాయి. పి.గన్నవరం మండలం అరిగెలవారిపేట, ఉడుమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంకకు వెళ్లే తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాంత వాసులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ సుమారు 2,800 మంది వరకు నివాసముంటున్నారు. రైతులు తమ ఉత్పత్తులను, పాడి రైతులు పాలను తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు బోట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇటువంటి వారి కోసం ఇక్కడ నాలుగు బోట్లను ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లో గోదావరి మధ్య ఉన్న లంకలో పంటలతోపాటు పశువులను మేపుతుంటారు. ఇటువంటి చోటకు వెళ్లేందుకు తాత్కాలిక రహదారులు వరద నీట మునగడంతో రైతులు పడవల మీద వాటి వద్దకు వెళుతున్నారు. వరద ఉధృతి పెరిగితే పశువులను తరలించేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇటుక బట్టీలకు నష్టం

ఆలమూరు మండలం ఆలమూరు, చొప్పెళ్ల, మూలస్థానం అగ్రహారం, పినపల్ల, రాయవరం మండలం మాచవరంలో ఇటుక బట్టీలు మూడు రోజులుగా మూతపడ్డాయి. వీటితోపాటు జిల్లాలో కపిలేశ్వరపురం మండలం వీధివారిలంక, కేదార్లంక, అంగర, అద్దంకివారిలంక, రావులపాలెం మండలం ఊబలంక, ఆత్రేయపురం మండలం అంకంపాలెం, అయినవిల్లి మండలంలో ముక్తేశ్వరం, వీరవల్లిపాలెం, అంబాజీపేటల్లో ఇటుక బట్టీలు అధికంగా ఉన్నాయి. సీజన్‌లో ఈ బట్టీలలో రోజుకు సుమారు 20 లక్షల వరకు ఇటుకలు తయారవుతాయి. ప్రస్తుతం అన్‌సీజన్ కావడం వల్ల రోజుకు 5 లక్షల వరకు ఇటు తయారవుతోందని అంచనా. గోదావరి వరదలకు తోడు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బట్టీలలో ఇటుక తయారీ దాదాపుగా నిలిచిపోయింది. తయారు చేసి కాల్చు చేయని ఇటుకలు వర్షాలకు దెబ్బతిన్నాయని బట్టీల యజమానులు చెబుతున్నారు.

కోటిపల్లి రేవు మూసివేత

గౌతమీ నదీపాయలో వరద ఉధృతి పెరగడంతో కోటిపల్లి- ముక్తేశ్వరం రేవు ప్రయాణాలను అధికారులు నిలిపివేశారు. ముక్తేశ్వరం వైపు నదిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారిపై వరద నీరు చేరింది. దీనితో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వరద మరింత పెరిగితే సఖినేటిపల్లి- నర్సాపురం, రాజోలు సోంపల్లి- అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల- కనకాయిలంక, పల్లంకుర్రు- కేశనకుర్రు వంటి రేవులను కూడా మూసివేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీలో నీట మునిగిన వరి చేను



అల్లవరం మండలం దేవగుప్తంలో భారీ వర్షాలకు మునిగిన నారుమడి



కోటిపల్లి రేవులో ఒడ్డుకు చేరిన పంట్లు

అత్యవసరం అయితేనే పడవలపై వెళ్లాలి



బూరుగులంకకు పడవపై వెళ్తున్న కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ



బూరుగులంక రేవులో పడవపై ప్రయాణిస్తున్న లంక గ్రామాల ప్రజలు

- లంక గ్రామాల ప్రజలకు ఆర్డీఓ సూచన
- పాఠశాలల విద్యార్థులకు సెలవు

పి.గన్నవరం: జి.పెదపూడి రేవులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయిన నేపథ్యంలో అత్యవసర పనులు ఉంటే మాత్రమే ఆయా లంక గ్రామాల ప్రజలు పడవలపై బయటకు రావాలని కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ సూచించారు. నదీపాయలో రహదారి కొట్టుకుపోవడంతో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్డీఓ శుక్రవారం పడవపై బూరుగులంకకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రేవులో నాలుగు ఇంజిన్ బోట్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పడవలపై ప్రయాణించే ప్రజలు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలని సూచించారు. రేవుల వద్ద పరిస్థితిని రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, మత్స్య శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. వరదల నేపథ్యంలో నాలుగు లంక గ్రామాల పాఠశాలల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించినట్టు ఆయన వెల్లడించారు. ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా సహాయం కోసం అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వరదకు తోడు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో లంక గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

బూరుగులంక రేవులో ఇంజిన్‌బోట్లు ఏర్పాటు చేసి, పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎస్సై బి.శివకృష్ణ, ఆర్ఐ పి.నర్సింహరావు, వీఆర్వోలు కాసర భగవాన్, నందుల దుర్గాప్రసాద్ ఆయన వెంట ఉన్నారు.

జిల్లాలో 78 మిల్లీమీటర్ల వర్షం

సాక్షి అమలాపురం: జిల్లాలో గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకు 78 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా మండపేటలో 121.4 మిల్లీమీటర్ల వర్షం కాగా, అత్యల్పంగా ఉప్పలగుప్తంలో 54.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో మండలాల వారీగా కాట్రేనికోన 117.8, ఐ.పోలవరం 97.4, ఆలమూరు 95.2, కొత్తపేట 90.2, రామచంద్రపురం 83.6, కె.గంగవరం 82.4, ముమ్మిడివరం 82.2, కపిలేశ్వరపురం 77.6, రావులపాలెం 75.4, అయినవిల్లి, అంబాజీపేట 74.8, అల్లవరం 71.6, ఆత్రేయపురం 69.8, మామిడికుదురు 69.6 రాయవరం, అంబాజీపేట 67.2, మలికిపురం 65.2, సఖినేటిపల్లి 63.2, పి.గన్నవరం 59.4, రాజోలు 56.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

తొమ్మిది మండలాలకు ప్రత్యేకాధికారుల నియామకం

- నేడు జిల్లాలో పాఠశాలలకు సెలవు
- కలెక్టర్ మహేష్ కుమార్
- వరద పరిస్థితి అడిగి తెలుసుకున్న సీఎం చంద్రబాబు



సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు, జేసీ నుపూర్ అజయ్

సాక్షి అమలాపురం: వరద సహాయక చర్యల పర్యవేక్షణకు తొమ్మిది మండలాలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 45 ఆవాసాలు, మూడు లంక గ్రామాలు ముంపు బారిన పడే అవకాశం ఉందన్నారు. ముంపు బారిన పడిన గ్రామాలలోని బాధితులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు సిద్ధం చేశామన్నారు. జలవనరుల శాఖ అధికారులు గౌతమి, వశిష్ఠ, వైనతేయలకు సంబంధించి జిల్లాలో 386 కిలోమీటర్ల ఏటిగట్టుకు గండ్లు పడకుండా నిత్యం పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారన్నారు. జిల్లా ప్రధాన కేంద్రంలో వరద సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్ (నంబర్: 08856-293104) ఏర్పాటు చేశామని తెలిపారు. మేజర్ డ్రెయిన్లు, కాలువలు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల ద్వారా వరద నీరు సవ్యంగా పారేలా మరమ్మతులు చేపట్టామని తెలిపారు. పి.గన్నవరం, ఐ.పోలవరం అక్విడెక్టుల వద్ద వరద నీరు కాలువల్లోకి రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో భారీ వర్షాలు... గోదావరి వరదలు నేపథ్యంలో శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. భారీ వర్షాలు వరదలు సమాంతరంగా వస్తే ముంపు తీవ్రత పెరగవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

అప్రమత్తంగా ఉండండి

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, గోదావరి నది వరదల ఉధృతి నేపథ్యంలో ముంపు బాధితుల సహాయక చర్యలకు మండల స్థాయిలో యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి 9 ముంపు మండలాల ప్రత్యేకాధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు హెచ్చరికలకు అనుగుణంగా సహాయక చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ అధికారులకు వివరించారు. అధికారుల అంచనా ప్రకారం వరద ఏడు లక్షల క్యూసెక్కుల వరకు వచ్చే అవకాశముందని ఆయన తెలిపారు. నాలుగు దశలలో సహాయ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వరదల వల్ల ఆవాసాలకు రాకపోకలు నిలిచిపోవడం, రోడ్లపైకి, ఇంట్లోకి వరద నీరు చేరే అవకాశం ఉంటుందని, బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. మండల పరిధిలో ఏటిగట్లు బలహీనంగా ఉన్న వాటి వివరాలు తెలపాలన్నారు. జిల్లా నీటి యజమాన్య సంస్థ, పంచాయతీరాజ్ అధికారుల సహకారంతో డ్రైనేజీల చోకింగ్ పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాలలో మధ్యాహ్నం పాఠశాల సిబ్బంది స్వయం సహాయ సంఘాల మహిళల సమన్వయంతో భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు మాట్లాడుతూ కమ్యూనికేషన్ వ్యవస్థ నిరంతరాయంగా పనిచేసేలా చూడడం అత్యంత అవసరమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్

గోదావరి వరదల కారణంగా చేపట్టాల్సిన సహాయక చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో వరద పరిస్థితిని కలెక్టర్ వివరించారు. కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జేసీ ఎస్.నుపూర్ అజయ్, అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

భవితకు నవోదయం

- 2025–26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 16 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ
- వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష

రాయవరం: ఉత్తమ విలువలతో బోధన..విద్యా ప్రమాణాల మెరుగు..క్రీడా ప్రతిభను వెలికి తీయడం.. సమైక్యతా భావం పెంపొందించడం..ఇవీ నవోదయ విద్యాలయాల్లో సాధారణంగా అమలు చేసే కార్యక్రమాలు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా 661 నవోదయ విద్యాలయాలు ఉండగా..కాకినాడ జిల్లాలో పెద్దాపురంలో ఉంది. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని విద్యార్థులు ఇక్కడ మాత్రమే దరఖాస్తుకు అర్హులు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్యను ఇక్కడ అందిస్తారు. విద్యతో పాటు అధునాతన సౌకర్యాల కల్పన, ప్రయోగాత్మక విద్య, క్రీడలు, క్రమశిక్షణ, ప్రతిభకు పెద్దపీట వేయడం ఈ విద్యా సంస్థల్లో ప్రత్యేకత.

రిజర్వేషన్ విధానం

నవోదయలో ప్రవేశానికి రిజర్వేషన్ విధానం అమలవుతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం తగ్గకుండా సీట్లు కేటాయిస్తారు. షెడ్యూల్ కులాలకు 15 శాతం, షెడ్యూల్ తరగతులకు ఏడు శాతం, దివ్యాంగులకు మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రవేశాల్లో బాలికలకు 33 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివితే నవోదయలో సీటు సంపాదించుకునే అవకాశం ఉంది.



జవహర్ నవోదయ విద్యాలయం

వసతులు

బాలబాలికలకు ప్రత్యేక ఉచిత వసతి గృహాలు, భోజనం, విద్య, నోట్‌బుక్స్ అందజేస్తారు. స్కూల్ యూనిఫామ్, షూస్, టాయిలెట్ సామగ్రి అంతా ఉచితమే. అర్హతతో పాటుగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నవోదయ విద్యాలయాల్లో బోధన చేస్తారు. శాస్త్ర, సాంకేతికతతో కూడిన విద్య, క్రీడలు, యోగా ద్వారా విద్యార్థికి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కల్పిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నామమాత్రపు రుసుం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు, బాలికలకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసిన తర్వాత దరఖాస్తు ఫారాన్ని ప్రింట్ తీసుకుని దగ్గర ఉంచుకోవాలి. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. సెప్టెంబర్ 16వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాల్సి ఉంది.

ఒక్కసారే అవకాశం

వచ్చే ఏడాది జనవరి 18న నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి విద్యాలయంలో ప్రవేశం లభిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయాలో మొత్తం 80 సీట్లు ఉంటాయి. ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఆయా మండలాల్లో ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. జవహర్ నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఒక్కసారి మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది. 2025–26 విద్యా సంవత్సరంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాలబాలికలు 2013 మే ఒకటో తేదీ నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో 3,4 తరగతులు ఉత్తీర్ణత సాధించి ఐదో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు.

పరీక్షా విధానం

నవోదయ ప్రవేశ పరీక్షను 2025 జనవరి 18న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జిల్లాలో నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తారు. విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న భాషను(తెలుగు/ఇంగ్లిషు) ఎంచుకొని పరీక్ష రాసే వీలుంది. ప్రవేశ పరీక్షలో 80 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహించే ప్రవేశ పరీక్ష రాసేందుకు రెండు గంటల సమయాన్ని కేటాయిస్తారు. మూడు విభాగాల్లో ప్రశ్నలు కేటాయిస్తారు. మేధాశక్తి(మెంటల్ ఎబిలిటీ)పై 40 ప్రశ్నలు 50 మార్కులకు, గణితం(అర్థమెటిక్), ఎంచుకున్న భాషపై ఒక్కొక్క విభాగానికి 20 ప్రశ్నలు వంతున 40 ప్రశ్నలు 50 మార్కులకు ఉంటాయి. తప్పుడు సమాధానాలకు నెగిటివ్ మార్కులు ఉండవు. దివ్యాంగులకు 40 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు. పరీక్షా పత్రాల రూపకల్పన నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) నిర్వహిస్తుంది. పరీక్షలో ఉత్తీర్ణులై ప్రవేశానికి ఎంపికైన వారికి మొదటి రెండు సంవత్సరాలు తెలుగు/ఇంగ్లిషు భాషల్లో బోధిస్తారు. అనంతరం ఇంగ్లిషులోనే బోధన చేస్తారు.

గతేడాది వచ్చిన దరఖాస్తులు ఇలా..

జిల్లా	వచ్చిన దరఖాస్తులు
కోనసీమ	3,548
తూర్పుగోదావరి	1,521
కాకినాడ	3,437

సద్వినియోగం చేసుకోవాలి



జవహర్ నవోదయలో ప్రవేశ పరీక్ష గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చక్కటి అవకాశం. మూడు జిల్లాల పరిధిలో అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యేలా విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించాలి. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. గతేడాదికి మించి దరఖాస్తులు వచ్చేలా ఎంఈవోలు పర్యవేక్షణ చేయాలి.

– కె.ఆర్.కృష్ణయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, పెద్దాపురం

అవగాహన కల్పించాలి



అధిక సంఖ్యలో విద్యార్థులు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధిక ప్రయోజనాలు కలగనున్నాయి. ఐదో తరగతి నుంచే ప్రవేశ పరీక్షను విద్యార్థులతో రాయించడం వల్ల వారిలో పోటీ పరీక్షలను ఎదుర్కొగలిగే ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

అనుమానంతోనే భార్య హత్య

భర్త అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం భావనారాయణపురంలో ఒడిశాకు చెందిన రితంజలి స్పైన్(31) హత్య కేసులో భర్త మీలు స్పైన్‌ను సర్పవరం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం భవన నిర్మాణ పనుల్లో భాగంగా సీలింగ్, హాల్‌టెక్ పనుల కోసం ఒడిశాలోని కూలంగి గ్రామం నుంచి మీలు స్పైన్ కుటుంబం, మరికొందరు వచ్చి భావనారాయణపురంలో అద్దెకు ఉంటున్నారు. భార్య రితంజలి స్పైన్ నెల రోజులుగా దగ్గరకు రానివ్వకుండా దూరం పెట్టడంతో ఆమెపై అనుమానం పెంచుకుని గొడవకు దిగాడు. ఈ క్రమంలోనే మద్యం మత్తులో ఈ నెల 16న ఉదయం ఇంటి వద్ద భార్య తలను నేలకేసి కొట్టడంతో పాటు పీక పిసికి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం మూడేళ్ల కుమారుడితో పరారయ్యాడు. పోలీసులు తొలుత అనుమానిత మృతిగా కేసు నమోదు చేసి హత్య కోణంలో దర్యాప్తు చేపట్టారు. సర్పవరం అటోనగర్ వద్ద నిందితుడు మీలు స్పైన్‌ను శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచడంతో న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అనుమానంతోనే భార్యను హత్య చేసినట్టు ఈ సందర్భంగా సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ మీడియాకు తెలియజేశారు.

అందరి సహకారంతో అభివృద్ధి

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యారంగంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా అందరి సహకారంతో అభివృద్ధికి పనిచేస్తానని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను శుక్రవారం పలువురు అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ,ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. విదేశీ వర్సిటీలలతో సరికొత్త కోర్సులపై ఒప్పందం, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పరిశోధన వంటి అంశాలు కీలకంగా ఉండేలా కృషి చేస్తానన్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్, ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్‌లతో పాటు ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ఉదయభాస్కర్, మాజీ వీసీలు ప్రసాదరాజు, శ్రీనివాస కుమార్, పద్మరాజు ఆయనను అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించిన అధికారులు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులకు ఇస్తున్న శిక్షణ రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. ఈ శిక్షణకు హాజరైన జిల్లా పరిషత్తు, డీపీఓ, సాంఘిక సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, స్త్రీ, సంక్షేమశాఖ, డ్వామా, వ్యవసాయ శాఖలకు చెందిన అధికారులు ఆయా శాఖల పరిధిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న పథకాలను వివరించారు. దీనిలో భాగంగా తక్కువ ఖర్చుతో సేంద్రియ వ్యవసాయం, ఈ గ్రామ స్వరాజ్, ఉపాధి హామీ పథకాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఈటీసీ ఫ్యాకల్టీలు శ్రీదేవి, పి.శ్రీనివాసరావు శిక్షణ ఇచ్చారు. ఫ్యాకల్టీలు వి.ప్రసాద్, బి.ఆంజనేయులు, కె.నిహారిక పాల్గొన్నారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె. వేణుగోపాల్ శిక్షణ తీరును పరిశీలించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించే ఈ శిక్షణ శనివారంతో ముగుస్తుంది.


అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

దాడి చేసినందుకు కేసు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన కటికిదల సూరిబాబుపై దాడి చేసి కొట్టినందుకు కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 17 రాత్రి 10 గంటలకు పాత గొడవలను దృష్టిలో ఉంచుకుని జయరాజు, శేఖర్, అశోక్ బీరు బాటిల్‌తో సూరిబాబుపై దాడి చేసి తలపై, ఎడమ చెయ్యి జబ్బపై కొట్టడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కూటమి అరాచక పాలన చూస్తూ ఊరుకోం

- తక్షణం ఆపకపోతే తీవ్ర పరిణామాలు
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు, హత్యలకు పాల్పడుతూ.. ఆస్తులు ధ్వంసం చేస్తూ బరితెగించి అరాచకంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. తక్షణం వాటిని నిలుపు చేయకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ , మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో వైఎస్సార్ సీపీలో ఉన్నామని అన్నారు. తమపై దాడులకు తెగబడితే తిరగబడతామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పర్యటనకు టీడీపీ శ్రేణులు అడ్డు పడుతున్నాయని అన్నారు. వినుకొండలో యువజన విభాగం నాయకుడు రషీద్‌ను కత్తితో దాడిచేసి హత మార్చడం దారుణమన్నారు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్నా తామెప్పుడూ కక్ష సాధింపులకు దిగలేదన్నారు. సాక్షాత్తూ ఒక ఎంపీకే రక్షణ లేకపోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటనేది అర్థం కావడం లేదన్నారు. ఈ పరిస్థితులను చూస్తూ ఊరుకునేది లేదని, తాము కూడా అటు చట్టపరంగా పోరాడుతూనే ఇటు రోడ్డెక్కడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. భయపెడితే ఇళ్లలో దాక్కునే రకం కాదని, ఇక తిరగబడతామని స్పష్టం చేశారు. జగన్ సింగిల్‌గా పోరాడారని, పెద్దలందరూ కూటమిగా ఏర్పడటంతో అధికారం కోల్పోయామని చెప్పారు. అయినప్పటికీ తమ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఏమాత్రం తగ్గలేదని, వైఎస్సార్ సీపీ ఇక్కడితో అయిపోతుందని భావిస్తే మాత్రం అది అమాయకత్వమే అవుతుందని అన్నారు. జగన్ ఎవరికీ భయపడరని, వెనుకడుగు వేయరని అన్నారు. తమకు ప్రతిపక్షం కొత్త కాదని, గతంలో ప్రతిపక్షం నుంచే అధికారంలోకి వచ్చామని గణేష అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు అరుణ్ జేకే, కేఆర్‌జే రాజేష్, సత్తి సందీప్, తగరం సోము, బుద్దాల రాజు, పిల్లా బాబీ, పుష్ప, అనిల్, దాట్ల పృథ్వి, నల్లా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

ఫిర్యాదు చేయడానికి వస్తే ఎస్సై దాడి చేశారు

మల్లవరానికి చెందిన ఇంటి సూర్యచంద్ర ఆరోపణ

గోకవరం: తన కుటుంబానికి అన్యాయం జరిగిందని పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఎస్సై తనపై దాడి చేశారని గోకవరం మండలం మల్లవరానికి చెందిన ఇంటి సూర్యచంద్ర ఆరోపించారు. గ్రామంలో తన ఇంటికి ఎదురుగా ఉన్న ఓ కుటుంబంతో తమకు కొంతకాలంగా గొడవలు ఉన్నాయన్నారు. ఈ నెల 11న తాను సొంత పనిపై వేరే ప్రాంతానికి వెళ్లగా తన ఎదురింటి వారు తన కుటుంబ సభ్యులపై రాళ్లతో దాడి చేశారన్నారు. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులు ఫోన్ చేసి తెలుపగా వెంటనే తాను 100కు డయల్ చేసి ఫిర్యాదు చేశానన్నారు. అదేరోజు రాతపూర్వకంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై గోకవరం ఎస్సై కె.నాగరాజు తమను మాటిమాటికి పోలీస్‌స్టేషన్‌కి పిలిచి వేధించారన్నారు. ఈ నెల 16న ఇరు పార్టీలను స్టేషన్‌కు పిలిచిన ఎస్సై జరిగిన ఘటనపై తాను వివరించే ప్రయత్నం చేయగా బయటకు గెంటివేశారన్నారు. బయట ఉన్న తనను ఎస్సై బూటు కాలితో తన్ని బూతులు తిట్టారన్నారు. ఎస్సై దాడిలో గాయపడ్డ తాను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది శుక్రవారం డిశ్చార్జి అయ్యానన్నారు. తాను ఫిర్యాదు చేసిన వ్యక్తుల వద్ద నుంచి ఎస్సై లంచం తీసుకుని తనపై దాడి చేశారని ఆరోపించారు. తనపై అన్యాయంగా దాడి చేసిన ఎస్సై నాగరాజుపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. తనకు న్యాయం చేసి ప్రాణరక్షణ కల్పించాలని కోరారు. దీనిపై ఎస్సై నాగరాజును వివరణ కోరగా తనపై సూర్యచంద్ర చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. కేసును విచారించే క్రమంలో అస్వస్థతకు గురైన అతన్ని గోకవరంలో ప్రభుత్వాస్పత్రికి పంపించామన్నారు.


రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు సూర్యచంద్ర

ఎర్రకాలువ ఉధృతికి మత్స్యకారుడి మృతి


కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి దుర్గేష్

నిడదవోలు: నిడదవోలు తీరుగూడెంకకు చెందిన మత్స్యకారుడు గనసాల వెంకటేష్(56) ఎర్రకాలువలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. శుక్రవారం వేకువజామున కంసాలిపాలెం సమీపంలో ఎర్రకాలువలో చేపలవేటకు వలలను తీసుకువెళ్లాడు. ఎర్రకాలువ ఉధృతికి ప్రమాదవశాతు పెద్దవలలు కాలుకు చుట్టుకుని మృత్యువాత పడ్డాడు. సమీపంలో ఉన్న తోటి మత్స్యకారులు వెంకటేష్‌ను కాలువలోనుంచి బయటకు తీశారు. అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని వెంకటేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎర్రకాలువలోకి చేపలవేటకు వెళ్లి ఇదేవిధంగా గతంలో కూడా చాలామంది మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయని, అధికారుల సూచనలను పాటించాలని మత్స్యకారులకు సూచించారు. మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావు చెరో రూ.ఐదువేలు మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కృష్ణారావు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు అధికారులను కోరారు.


ఎర్రకాలువలో మృతి చెందిన మత్స్యకారుడు గనసాల వెంకటేష్(56), మృతదేహాన్ని బయటకు తీస్తున్న మత్స్యకారులు

వలలో చిక్కుకుని మత్స్యకారుడి మృతి

మామిడికుదురు: సముద్ర తీరంలోని గోదావరి పాయలో వేటాడుతూ వల విసురుతుండగా అదే వలలో చిక్కుకుని కరవాక గ్రామానికి చెందిన మత్స్యకారుడు శుక్రవారం మృత్యువాత పడ్డాడు. ఈ ప్రమాదంలో కొప్పాడి రాంబాబు (39) మృతి చెందాడని నగరం ఎస్సై పి.సురేష్ తెలిపారు. మృతుని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేశామన్నారు. మధ్యాహ్న సమయంలో మోచేతి వలతో వేటాడుతుండగా ప్రమాదవశాత్తూ తాను విసిరిన వలలోనే చిక్కుకున్న రాంబాబు నీటిలో మునిగిపోయాడన్నారు. సహచర మత్స్యకారులు వెళ్లి బయటకు తీసే సమయానికే అతను మృతి చెందాడని తెలిపారు. రాంబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి పంపించామన్నారు.


మృతుడు రాంబాబు

10 నుంచి కిక్ బాక్సింగ్ పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): వై.జంక్షన్ సమీపంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆగస్టు 10, 11వ తేదీలలో 31వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్టు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో శుక్రవారం బ్రోచర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 1,500 మంది క్రీడాకారులు హాజరవుతారని, వారందరికీ వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజమండ్రి కిక్ బాక్సింగ్ చైర్మన్ రొంపిచర్ల ఆంటోనీ దాస్, మిత్ర బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సంతోష్ అగర్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ బాలు, రాష్ట్ర కార్యదర్శి పి.ఆనంద్ ఆచార్య పాల్గొన్నారు.

పన్ను మినహాయింపుపై అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక సంస్థలు జీఎస్‌టీ, ఆదాయ పన్ను మినహాయింపుల సమయంలో తీసుకోవలసిన అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ డి.విజయభారతి పిలుపునిచ్చారు. శుక్రవారం రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో రాష్ట్ర ఆడిట్ శాఖ, ఇన్‌కమ్ ట్యాక్స్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్‌టీ, ఆదాయ పన్నుల చెల్లింపులపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూలధనం పన్ను మినహాయింపు, మూలధనం నుంచి వసూలుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, నిడదవోలు, కొవ్వూరు సిబ్బంది, ఆదికవి నన్నయ యూనివర్శిటీ అకౌంట్ సిబ్బందికి, జీఎస్టీ, ఇన్ కమ్ ట్యాక్స్ సంబంధ అంశాలపై సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఇన్‌కమ్ ట్యాక్స్ అదనపు కమిషనర్ కె.శ్రీనివాసులు, జోన్ 2 స్టేట్ ఆడిటర్ ఆర్డీడీ బి. చిన్నపరెడ్డి, జోన్ 1 స్టేట్ ఆడిట్ ఆర్డీడీ పి.సీతారామారావు, జిల్లా ఆడిట్ అధికారి కేఎన్ వెంకటేశ్వరరావు, ఇన్ కమ్ ట్యాక్స్ అధికారి కె.దేవదత్తం, చార్టర్డ్ అకౌంటెంట్ టి.భాను పృధ్వీరాజ్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న జీఎస్టీ, ఆదాయపన్ను శాఖ అధికారులు

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం శనివారం ఉదయ 10.30 గంటలకు కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశంలో పలు అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

దొరికిన బంగారం యజమానులకు అందజేత


సీఐ లక్ష్మణరావు సమక్షంలో బంగారు వస్తువులను యజమాని రాణికి అందిస్తున్న నూకరాజు తదితరులు

జగ్గంపేట: తమ దొరికిన బంగారు వస్తువుల వాటి యజమానులకు అందించిన పాస్టర్ల బృందాన్ని బాధితులు, పోలీసులు అభినందించారు. పోగొట్టుకున్న రూ.70వేల విలువైన బంగారు వస్తువులను జగ్గంపేట సీఐ సమక్షంలో శుక్రవారం నిజాయితీగా అందించారు. సీఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, పాస్టర్ నూకరాజు, తన మిత్రులు అయిన పాస్టర్ విలీషారాజా, ఎన్వియిర్ చక్రవర్తి ఈ నెల 17వ తేదీన కాట్రావులపల్లి వెళుతుండగా అతనికి మార్గం మధ్యలో ఒక పర్సు దొరికింది. నూకరాజు పరిశీలించగా వాటిలో బంగారు వస్తువులు వున్నాయి. అయితే వస్తువులు కొన్న రసీదు వుండడంతో వాటిని జగ్గంపేట సీఐ లక్ష్మణరావుకు అందచేశారు. రసీదు ఆధారంగా బిక్కవోలుకు చెందిన రాణి ఆ వస్తువులు పోగొట్టుకున్నట్టు పోలీసులు గుర్తించి జగ్గంపేట స్టేషన్‌కు రప్పించారు. వ్యాపారి నూకరాజుతో కలిసి పాస్టర్లు, సీఐ లక్ష్మణరావు వస్తువులను ఆమెకు అందజేశారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరి దుర్మార్గమైన చర్యని రాజమహేంద్రవరం డివిజన్ తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి.కొండబాబు ధ్వజమెత్తారు. శుక్రవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మిక సమాఖ్య ఇచ్చిన పిలుపు మేరకు రాజమహేంద్రవరం, మండపేట, రామచంద్రపురం తపాలా కార్యాలయాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించినట్టు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటు ఈ సరికే జరిగి ఉంటే, 1.1. 2026 నుంచి కొత్త వేతనాలు పొందే అవకాశం ఉండేదన్నారు. వేతన సంఘం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం తన వ్యతిరేక వైఖరిని ఇప్పటికే చట్టసభల సాక్షిగా వెల్లడించిందని తెలిపారు. ఉద్యోగులు హక్కుగా పొందాల్సిన 18 నెలల కరవు భత్యాన్ని కేంద్ర ప్రభుత్వం దూరం చేసిందని, కార్మిక హక్కులను కాలరాయాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగ,కార్మిక సమాఖ్య వీటిని నిలువరించి న్యాయమైన కోర్కెల సాధనకు దీర్ఘకాల పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఉన్నతాధికారులకు మెమొరాండం సమర్పిస్తామని తెలిపారు. తపాలా పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు